

నంద్యాల ఏఎస్పీగా మహేంద్ర


కర్నూలు, ఆగస్టు 16: నంద్యాల జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా ఎం.మహేంద్రను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం ఏసీబీ అదనపు ఎస్పీగా పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా నంద్యాల ఏఎస్పీగా కొనసాగుతున్న ప్రవీణ్ కుమార్‌ను విశాఖపట్నం ట్రాఫిక్ అదనపు డీసీపీగా బదిలీ చేశారు. బదిలీ అయిన వారు తక్షణమే విధుల్లో చేరాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భారీగా భూమేత

గత ఐదేళ్లలో అసైన్డ్ భూములను వైసీపీ నేతలు, సీనియర్ అధికారులు కారుచౌకగా కొట్టేశారు. దశాబ్దాల కింద ప్రభుత్వం పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు సాగు కోసం అసైన్డ్ భూములు ఇచ్చింది. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు పేదలకు అసైన్డ్ భూములపై వారికి యాజమాన్య హక్కు కల్పిస్తామని చెప్పి, ముందస్తు ఒప్పందాలు చేసుకుని.. నయానో.. భయానో ఆ భూములను కాజేశారు. రాష్ట్రంలో అసైన్డ్ భూములను గత వైసీపీ ప్రభుత్వంలో ఎంత మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారనే వివరాలను ఐజీ రామకృష్ణ ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. సెప్టెంబరు రెండో వారం నుంచి 45 రోజులపాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఆ ప్రకారం రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని నిగ్గు తేల్చాలని, అసైన్డ్ భూములు దక్కించుకున్న నేతల అక్రమాల గుట్టు రట్టు చేయాలని కూటమి ప్రభుత్వం భావించింది. దీంతో అసైన్డ్ భూములు కాజేసిన వైసీపీ నేతల్లో వణుకు మొదలైంది.

-కర్నూలు(అగ్రికల్చర్)





రాష్ట్రంలోని 25 జిల్లాల్లో రిజిస్ట్రేషన్ అయిన అసైన్డ్ భూముల వివరాలను రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ ప్రభుత్వానికి అందజేశారు. ఈ వివరాల ప్రకారం గత ఆరు నెలల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 39,398.07 ఎకరాల అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తోంది. అందులో అత్యధికంగా నంద్యాల జిల్లాలో 15,497.08 ఎకరాల అసైన్డ్ భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లాయి. కర్నూలు జిల్లాలో 4,892 ఎకరాలు రిజిస్టర్ అయ్యాయి.

నిరుపేదలైన రైతులకు, ముఖ్యంగా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలకు దశాబ్దాల కింద అప్పటి ప్రభుత్వాలు భూమిని ఉచితంగా పంపిణీ చేసింది. గత వైసీపీ హయాంలో ఆ పార్టీ ముఖ్య నేతలు, వారి అనుచరులకు కట్టబెట్టేందు కోసం పెద్ద వ్యూహాన్ని అమలు చేసింది. ఇందులో భాగంగానే నిరుపేదలకు కేటాయించిన భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఇందులో భాగంగా జీవో.నెం.596ను జారీ చేసి నిషిద్ధ జాబితాలో ఉన్న 22ఏ సెక్షన్‌లో ఉన్న దాదాపు 9లక్షల ఎకరాల భూములను ఆ జాబితా నుంచి తొలగించారు. ఎటువంటి ప్రజాభిప్రాయం లేకుండానే అసాధారణ రీతిలో ఆరు నెలల్లోనే ఈ కథ అంతా నడిపించేశారు. నిషిద్ధ జాబితా 22ఏ సెక్షన్ నుంచి పెద్ద ఎత్తున తొలగించిన అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లను చకచకా చేశారు.

నంద్యాలలో 15,497.08 అసైన్డ్ భూములు, కర్నూలులో 4,862 ఎకరాలు

యాజమాన్య హక్కుల కల్పన నిర్ణయంతో సంబంధం లేకుండానే కొన్ని చోట్ల పేదల భూములను పెద్దలు కొనేశారు. అంతేగాకుండా కొందరు తమ పలుకుబడిని ఉపయోగించి పేదల పేర్లు తీసేసి తమ అనుచరులు, బంధువుల పేర్లను అక్రమ పద్ధతుల్లో నమోదు చేయించుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి 22ఏ సెక్షన్ కింద నమోదైన అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ పేరుతో నిషిద్ధ జాబితా నుంచి తొలగిస్తూ జీవో.596ను అమలులోకి తేవడంతో అప్పటికే ఈ జీవో వస్తుందని అంచనా వేసుకున్న వైసీపీ నేతలు, వారి అనుచరులు రాత్రికి రాత్రి రిజిస్ట్రేషన్ల వ్యవహారాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు.

- రెవెన్యూ సదస్సుల్లో తేలనున్న నిగ్గు
- పేదల అసైన్డ్ భూములు కొట్టేసిన నేతల్లో వణుకు
- సెప్టెంబరులో రెవెన్యూ సదస్సులు
- రాష్ట్రంలోనే అత్యధికంగా నంద్యాలలో 15,497.08 ఎకరాలు
- కర్నూలులో 4,862 ఎకరాలు అసైన్డ్ భూముల కైవసం

కర్నూలు జిల్లాలోని అసైన్డ్ భూములు



హడావుడిగా రిజిస్ట్రేషన్లు

2023 జూలై 21వ తేదీ నాటికంటే 20 ఏళ్ల ముందు అసైన్డ్ చేసిన వ్యవసాయ భూములను అమ్ముకునే వెసలుబాటు కల్పిస్తూ గత ఏడాది అక్టోబరు 27న వైసీపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి అనుగుణంగా మార్గదర్శకాల జీవో.596 డిసెంబరులో జారీ చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు వేగంగా జరిగేందుకు వీలుగా క్షేత్ర స్థాయిలో అధికారులు కొర్రీలు పెట్టకుండా ఉండేందుకు ఆనాటి రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రామకృష్ణ ఈ ఏడాది జనవరిలో మూడు మెమోలు జారీ చేశారు. వెబ్ ల్యాండ్‌లో ఉన్న వివరాలను కూడా పరిశీలించకుండా కలెక్టర్లు జాబితాకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చేయాలని నిషేధిత జాబితా నుంచి తప్పించాలని కలెక్టర్లకు పంపిన మెమోలో పేర్కొనడం దారుణం. అత్యధికంగా నంద్యాలతోపాటు పుట్టపర్తి, రాయచోటి, కర్నూలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో 25 వేల ఎకరాల అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్లు జరిగాయి. యాజమాన్య హక్కులు నిరుపేద రైతులకు ప్రభుత్వం కల్పించినప్పటికీ గత కొన్ని దశాబ్దాల నుంచి ఆధీనంలో ఉన్న భూములు అమ్ముకునే వారు సాధారణంగా తక్కువగా ఉంటారు. వైసీపీ ప్రభుత్వం చకచకా జారీ చేసిన సెక్షన్ 22ఏ ద్వారా కేవలం గత 6 నెలల వ్యవధిలో ఆ ప్రభుత్వంలోని నాయకులు, వారి అనుచరులు నిరుపేదల రైతుల నుంచి చేజిక్కించుకున్నారు.

నంద్యాల జిల్లాలో వైసీపీ పెద్దలు, వారి అనుచరులు రిజిస్ట్రేషన్ శాఖలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందిని ఇళ్ల వద్దకే పిలిపించుకుని 15,497 అసైన్డ్ ఎకరాల దస్త్రాలు చేజిక్కించుకున్నారు. కర్నూలు డివిజన్ పరిధిలో దాదాపు 56 గ్రామాల్లో 500 ఎకరాల దాకా అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఓర్వకల్లు, కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు,

అసైన్డ్ భూముల్లో వైసీపీ నేతల పాగా

మంత్రాలయం, కల్లూరు, ఆదోని తదితర చోట్ల నిరుపేదల అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించారు. ఎంతో విలువైన ఈ భూములపై కన్నేసిన వైసీపీ నేతలు తక్కువ ధరకు ఒప్పందం చేసుకొని, ఆ మేరకు డబ్బు వారి చేతుల్లో పెట్టి కాజేశారనే ఫిర్యాదులు సర్వత్రా వెలువెత్తుతున్నాయి.

రెవెన్యూ సదస్సుల్లో బట్టబయలు కానున్న భాగోతం

సెప్టెంబరు రెండో వారంలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులో అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారం నిగ్గు తేలనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత వైసీపీ ప్రభుత్వంలో జారీ చేసిన జీవో.596ను రద్దు చేశారు. అదే విధంగా 22ఏ సెక్షన్‌లో పేర్కొన్న అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ ఉత్తర్వులను కూడా రద్దు చేశారు. ఈ అక్రమాలను వెలికి తీసి అసైన్డ్ భూములను మళ్లీ పేద రైతులకే చెందేలా చూడాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసిన కూటమి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు భూ సమస్యలను పరిష్కరించి రైతుల మధ్య వివాదాలను చల్లార్చేందుకు ప్రయత్నిస్తోంది.







సూర్యనారాయణ స్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

కర్నూలు (కల్చరల్), ఆగస్టు 16: శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా పలు దేవాలయాల్లో, నివాసాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేక కార్యక్రమాలు, అష్టోత్తర శతనా మార్చనలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన పట్టు వస్త్రాలను అమ్మవారికి అలంకరించి కుంకుమార్చన చేశారు. అమ్మవారి సన్నిధిలోని శ్రీచక్రానికి పూజలు నిర్వహించి ఉద్యాపన వ్రతం చేశారు. అమ్మవారికి ఒడిబియ్యం పోయడంతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. గుత్తిరోడ్డులోని సూర్య నారాయణస్వామి ఆలయంలో మహాగౌరీ అమ్మవారికి విశేష అర్చనలు చేశారు. బంగారు చీరతో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు.



అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సూర్య నారాయణ స్వామి దేవాలయంలో బంగారు చీరె అలంకరణలో అమ్మవారు

శ్రీశైలంలో...



శ్రీశైలం, ఆగస్టు 16: శ్రీశైల మహాక్షేత్రంలో వరలక్ష్మీవ్రతం ఘనంగా సందర్భంగా ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతం దేవస్థానం ఘనంగా నిర్వహించింది. ఈ వ్రతాన్ని ఆలయ ఉత్తరద్వారం ఎదురుగా ఉన్న చంద్రావతి కల్యాణ మండపంలో నిర్వ హించారు. ఈ వ్రతంలో 1,500 మంది మహిళలు పాల్గొ న్నారు. వ్రతంలో పాల్గొన్న వారికి అమ్మవారి శేషవస్త్రాలుగా చీర, రవికవస్త్రం, పూలు, గాజులు, ప్రసా దాలు, శ్రీశైలప్రభ సంచికను అందజేసి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈఓ డి.పెద్దిరాజు దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ ఆర్.రమణమ్మ, ఏఈవో హరిదాసు, అధ్యాపక ఎం.పూర్ణానంద ఆరాధ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వ్రతం మహోత్సవాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా ఐదు ఎల్ఈడీ భారీ స్క్రీన్లను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.

జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించండి

- రెండు రోజులపాటు వర్క్‌షాపు
- కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 16: ఐదేళ్ల లక్ష్యాలతో జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకుని, వాటి అమలుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఐదేళ్ల విజన్ ప్లాన్ రూపకల్పనపై జిల్లా అధికారులతో నిర్వహించిన వర్క్‌షాపులో కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రెండు రోజుల పాటు జరగనున్న వర్క్‌షాపులో 45 శాఖల అధికారులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాలలో జిల్లాను అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాలు పెంపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఆర్థికాభివృద్ధి రూ.47,514 కోట్ల నుంచి రూ.95,567 కోట్ల మేరకు పెరిగేలా అభివృద్ధి వ్యూహాలను రచించాలన్నారు. అలాగే తలసరి ఆదాయం రూ.1,74,932 నుంచి రూ.3,51,852కు పెంచేలా కీలకమైన శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం అయినందున జిల్లాలో రైతులు పండించే పంటలను మార్కెటింగ్ చేసే అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కొన్ని జిల్లాలో రైతులకు కంపెనీలతో టయప్ చేసే అంశం ఆలోచించాలని అన్నారు. జిల్లాలో కూరగాయల ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి ఒక పోర్టల్‌ను రూపొందించాలని జిల్లా ఇన్ఫార్మాటిక్ అధికారిని ఆదేశించారు. ఈ పోర్టల్‌లో జిల్లాలో పండించే ఉత్పత్తులు, ధరల వివరాలను ఉంచడం వల్ల ట్రేడర్స్ నేరుగా రైతుతో మాట్లాడి పంటను కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. టమోటా పండించే ప్రాంతాల్లో పంట దిగుబడిని నిల్వ చేసుకునేందుకు వీలుగా ఆర్కేవీవై, ఎంఐడీహెచ్ పథకాల కింద రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా కోల్డ్ రూమ్‌ల ఏర్పాటు తగిన చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. అలాగే బహుళ ప్రయోజన కేంద్రాలు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి కేంద్రాలను అప్పగించాలని సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ సంబంధించి పాడి పరిశ్రమ అభివృద్ధి, పాల ఉత్పత్తుల తయారీ, పొట్టేళ్ల పెంపకం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. మత్స్యశాఖకు సంబంధించి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల్లో సీడ్ పాండ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఫిష్ కల్చర్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారిని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 20వ తేదీ నాటికి జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, సీపీవో హిమప్రభాకర్, అసిస్టెంట్ డైరెక్టర్ భారతి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఏపీఐఐసీ జెడ్ఎం సోమశేఖర్ రెడ్డి, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, డీసీవో రామాంజనేయులు, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, మార్కెటింగ్ అధికారి నారాయణమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

జూడాల ర్యాలీ

నాలుగో రోజుకు చేరిన సమ్మె

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 16: కలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ మేరకు శుక్రవారం జూనియర్ డాక్టర్లు కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ చేశారు. అక్కడ మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు అచ్యుత్, తమాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులకు రక్షణ కరువైందన్నారు. కర్నూలు జీజీహెచ్‌లో మహిళా వైద్య విద్యార్థినులకు సరైన వసతులు కూడా లేవని వాపోయారు. కలకత్తాలో యువడాక్టర్‌పై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ల సమ్మెకు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నగర కార్యదర్శి హుసేన్‌బాషా సంఘీభావం తెలిపారు. జూనియర్ డాక్టర్‌ను దారుణంగా హత్య చేయడం దుర్మార్గమైన చర్య అని ఏపీ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాసు యాదవ్ అన్నారు. ఈ మేరకు రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో గ్రామీణ వైద్యుల సంఘం అత్యవసరంగా సమావేశం నిర్వహించి ఐఎంఏ వైద్యసేవలు బంద్‌కు మద్దతు తెలిపారు.



ర్యాలీ చేస్తున్న జూనియర్ డాక్టర్లు



వర్షపు నీటిలో తడిసిన వేరుశనగను కాపాడుకుంటున్న రైతు



వర్షపు నీటికి కొట్టుకుపోతున్న వేరుశనగను ఒడిసి పట్టుకుంటున్న రైతు



వేరుశనగ రాశుల కిందికి చేరిన వర్షపు నీరు

వర్షార్పణం

- మార్కెట్ యార్డులో వానకు కొట్టుకుపోయిన వేరుశనగ
- ప్లాట్ ఫామ్‌పై మోకాలి లోతు నీరు
- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- కనీస సౌకర్యాలు కల్పించని అధికారులు

ఆదోని (అగ్రికల్చర్, ఆగస్టు 16: ఆదోని పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు అరగంట పాటు భారీ వర్షం కురిసింది. విక్రయానికి తీసుకొచ్చి మార్కెట్ యార్డ్ ప్లాట్ ఫామ్‌పై రాశులుగా పోసిన వేరుశనగ కాయలు తడిసిపోకుండా కాపాడుకోడానికి రైతులు అష్ట కష్టాలు పడ్డారు. మార్కెట్ కమిటీ అధికారులు నిర్లక్ష్యం వల్ల టార్పాళ్ళు దొరకక వేరుశనగ కాయలు కొట్టుకుపోయాయి. కళ్లెదుటే వాన నీళ్ల కొట్టుకుపోతుంటే వడిసి పట్టుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ప్లాట్ ఫామ్ ముందు దుకాణాల వద్ద డ్రైనేజీలు శుభ్రపరచకపోవడంతో వర్షపు నీరు ముందుకు వెళ్లక మోకాలిలోతులో ప్రవహించి ప్లాట్‌ఫామ్ మీదికి చేరుకున్నాయని కన్నీటి పర్యంతమయ్యారు. బోరు బావులు కింద సాగైన వేరుశనగ ఇప్పుడిప్పుడే చేతికందడంతో రైతులు గత ఐదు రోజులుగా భారీగా వేరుశనగ దిగుబడులను విక్రయానికి తీసుకొస్తున్నారు. శుక్రవారం 5,722 బస్తాలు వేరుశనగ విక్రయానికి వచ్చాయి. కర్ణాటక, అనంతపురం రైతులు కూడా విక్రయానికి వేరుశనగ తీసుకొని వచ్చారు. నష్టపోయిన రైతులు తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

124 బస్తాలు వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి



150 కిలోమీటర్ల దూరం నుంచి మా ఆదోని మార్కెట్ కమిటీకి 124 బస్తాలు వేరుశనగ దిగుబడిని విక్రయానికి తీసుకొని వచ్చాను. వర్షం రావడంతో ప్లాట్‌ఫామ్ పైకి నీరు వచ్చి వేరుశనగ అంతా కొట్టుకుపోయింది.

-భీమన్న రైతు, ఎరిగేరి గ్రామం రాయచూరు జిల్లా

సౌకర్యాలు కల్పించకపోవడంతో నష్టం



ఇంత పెద్ద మార్కెట్ కమిటీలో రైతులు తెచ్చిన దిగుబడులకు కనీస సౌకర్యాలు రక్షణ కల్పించలేదు. దీంతో వేరుశనగ రైతులం తీవ్రంగా నష్టపోయాం. అప్పు చేసి పెట్టుబడి పెట్టి సాగు చేశాను. దిగుబడి విక్రయానికి తెస్తే నీటిపాలయ్యింది.

-భీమయ్య పెద్ద తుమ్మలం గ్రామం

పెద్దకడబూరు మండలంలో భారీ వర్షం

వరుణుడి రాకతో రైతుల్లో ఆనందం

పెద్దకడుబూరు: మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షం రైతు కళ్ళల్లో ఆనందం నింపింది. ఎండిన పైరు జీవంతో మళ్లీ పురుడు పోసుకుంది. మండల పరిధిలోని కల్లుకుంట, మేకడోణ, నౌలేకల్, చిన్నకడబూరు, రంగపురం, తారాపురం, పీకలబెట్ట, గవిగట్టు గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో మిరప, పత్తి, బొప్పాయి, ఉల్లి పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. దీంతో పాటు రహదారులు వాగులు, వంకలు కూడా వర్షం నీరుతో పొంగి పొర్లాయి. మూడు రోజుల పాటు ఉక్కపోతకు శుక్రవారం కురిసిన వర్షానికి రైతులకు, మండల ప్రజలకు భారీ ఊరటనిచ్చింది.



రహదారిపైకి వర్షం నీరు రావడంతో నిలిచిపోయిన వాహనాలు

కస్తూర్బా ప్రిన్సిపాల్‌పై వేటు

విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు



కవిత, ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరు, ఆగస్టు 16: ఎమ్మిగనూరు పట్టణంలోని షైనార్టీ కాలనీలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ కవితపై జిల్లా ఉన్నతాధికారులు వేటు వేశారు. విద్యార్థినులకు సకాలంలో భోజనం అందించడంలో నిర్లక్ష్యం వంటి ఆరోపణలు రుజువు కావడంతో ఆమెను విధుల నుంచి తొలగిస్తూ డీఈవో శ్యామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్నేళ్లుగా కవిత విధుల్లో నిర్లక్ష్యం వహించడం తోపాటు విద్యార్థినులకు సకాలంలో భోజనం కూడా అందించడం లేదని ఆరోపణలు వచ్చాయి. విద్యార్థినులు ఈ విషయం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి సంఘాల నాయకుల చొరవతో పత్రికలు, మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. దీనికి స్పందించిన జిల్లా డీఈవో కార్యాలయంలో ఏడీఏ శ్యామ్యూల్‌పాల్, ఎస్ఎస్ఏ జీడీసీవో, డిప్యూటీ డీఈవోలు గతనెల 25వ తేదీన విద్యాలయానికి చేరుకొని విద్యార్థినులను కలిసి విచారించారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయి? నాణ్యమైన భోజనం సకాలంలో అందుతుందా? అనే విషయాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ ఇబ్బందులను తెలిపారు. ఓ విద్యార్థిని అయితే ఏకంగా ఉన్నతాధికారులు ఎదుట కన్నీరు మున్నీరైంది. అలాగే వంట మనుషులు, వాచ్‌మెన్, ఇతర పనులు చేస్తున్న సిబ్బందిని అధికారులు విచారించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున అధికారులు ముందు ఆందోళనకు దిగి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యాలయంలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా అధికారులు నివేదికను డీఈవో ద్వారా కలెక్టర్‌కు సమర్పించారు. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి సైతం విద్యార్థిని ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కేజీబీవీ విద్యాలయం ప్రిన్సిపాల్ కవితను విధుల నుంచి తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఆర్టీ ఇంగ్లీష్ అధ్యాపకురాలు మాలుంబికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

జిల్లా జైలులో తనిఖీలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శేషాద్రి

కర్నూలు(లీగల్), ఆగస్టు 16: స్థానిక పంచలింగాలలోని జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆయన జైలు రికార్డులను, ఖైదీల గదులను, వంట శాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, బాలలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయిస్తే ఉచిత న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా ఖైదీలకు మెరుగైన ఉచిత న్యాయ సేవలు ఉన్నాయని తెలిపారు. ఆ తర్వాత వర్కూరు, గూడూరు, కల్లూరు, ఓర్వకల్లులోని కేజీబీవీ విద్యాలయాలను ఆయన తనిఖీ చేశారు.

వాకిటి శ్రీనివాసులు హత్యపై దర్యాప్తు

పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు?

పత్తికొండ, ఆగస్టు16: పత్తికొండ ప్రాంతంలో సంచలనం రేకెత్తించిన టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు హత్యకేసుపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగిన తీరు మొదలుకుని వాకిటి శ్రీనివాసులుతో విభేదాలు ఉన్న వ్యక్తుల వివరాలు, నిత్యం కలసి తిరిగే వారి వివరాలుసేకరించి వారిని స్టేషన్‌కు పిలిచి విచారిస్తున్నట్లు సమాచారం. శ్రీనివాసులు ఫోన్‌లో కాల్ డిటైల్స్‌ను కూడా పరిగణలోకి తీసుకున్నారు గ్రామానికి చెందిన ఆరుగురిని ు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

పాము కాటుతో యువకుడి మృతి

తుగ్గలి, ఆగస్టు 16: పాము కాటుకు గురై శివమణి (21) అనే యువకుడు మృతి చెందినట్లు తుగ్గలి ఎస్ఐ జమీర్ తెలిపారు. శుక్రవారం పెండేకల్‌కు చెందిన శివమణి గత వారం రోజుల క్రితం ఇంట్లో నిద్రిస్తుండగా.. చేతి వేలుకు పాము కాటేయడంతో చికిత్స నిమ్మితం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించడంతో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతునికి భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, ఆగస్టు 16: పందిర్లపల్లె గ్రామానికి చెందినమహిళా రైతు సువర్ణ(38) అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. వేరుశనగ పంట అమ్మగా వచ్చిన డబ్బులు వడ్డీలు చెల్లించేందుకు కూడా సరిపోలేదని భార్యాభర్తలు చర్చించుకున్నారు. ఆ తర్వాత బావి దగ్గరకు వెళ్లివస్తానని చెప్పిన భార్య సువర్ణ ఎంతసేపటికి రాక పోవడంతో వెళ్ళి చూడగా పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. తల్లి కేశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాజావలి తెలిపారు. మృతురాళికి ముగ్గురు సంతానం. అడపిల్లల పెళ్ళి కోసం, పంటల సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక మనో వ్యథతో సువర్ణ ఆత్మహత్య చేసుకోవడం వల్ల కుటుంబంలో తీరని దుఃఖానికి లోనైంది.

ట్రిపుల్ ఐటీకి రూ.22 కోట్లు

- తాగునీటి అవసరాలకు తొలివిడతగా రూ.9.45 కోట్లు
- గత ప్రభుత్వంలో వెనక్కు వెళ్లిన నిధులు
- ఎమ్మెల్యే గౌరు చరిత చొరవతో నిధుల విడుదల



కల్లూరు, ఆగస్టు 16: నగర శివారులోని జగన్నాథగట్టు ట్రిపుల్ ఐటీ కళాశాల తాగునీటి అవసరాల కోసం రూ.22 కోట్ల నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు తొలివిడతగా రూ.9.45 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిజానికి ఈ నిధులు గత వైసీపీ ప్రభుత్వంలోనే మంజూరయ్యాయి. అయితే అప్పట్లో ప్రభుత్వం, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం, పనుల్లో జాప్యం కారణంగా ఆ నిధులన్నీ వెనక్కు వెళ్లాయి. ఈ క్రమంలో నిధులను మళ్లీ తెప్పించి ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థకు వినియోగించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత చేసిన కసరత్తు మంచి ఫలితాలను ఇచ్చింది. రూ.22 కోట్లను విద్యా సంస్థ అవసరాలకు కేటాయించాలని కోరుతూ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేశ్, నారాయణ దృష్టికి ఎమ్మెల్యే గౌరు చరిత పలుమార్లు తీసుకెళ్లారు. దీంతో తొలి విడతగా రూ.9.45 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. ఈ నిధులతో మునగలపాడు నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా నీటిని ట్రిపుల్ ఐటీ కళాశాలతోపాటు కొన్ని వార్డులకు తాగునీరు అందించే లక్ష్యంతో పనులు వేగవంతం చేయనున్నట్లు గౌరు చరిత తెలిపారు. నగర పాలక సంస్థ అధికారులు ఆ దిశగా దృష్టి సారించి నాణ్యతా ప్రమాణాలతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పైప్‌లైన్ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్‌పేట, పెద్దపాడు, పందిపాడు, లక్ష్మీపురం, దిన్నెదేవరపాడు మీదుగా పైప్‌లైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ట్రిపుల్ ఐటీ తాగునీటి అవసరాల కోసం రూ.22 కోట్లతో టెండరు ప్రక్రియ పూర్తయింది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ప్రత్యేక చొరవతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో నిధులు కేటాయింపునకు కృషి చేయగా మొదటి విడతగా రూ.9.45 కోట్లు విడుదల కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో కల్లూరు పరిధిలోని(36, 28, 32 వార్డులు) పెద్దపాడు, పందిపాడు, లక్ష్మీపురం, దూపాడు, ముజఫర్‌నగర్ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే అవకాశం ఉన్నట్లు ఎమ్మెల్యే గౌరుచరిత స్పష్టం చేశారు.



కర్నూలు నగరంలోని ట్రిపుల్ ఐటీఎం

ఉత్సవాలకు ముస్తాబవుతున్న మంత్రాలయం

మంత్రాలయం, ఆగస్టు 16: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు ప్రధాన రహదారులను అందంగా తీర్చిదిద్దుతున్నారు. బెంగుళూరు చెందిన నాగరాజు అనే భక్తుడు రూ.1.98 కోట్లతో నిర్మిస్తున్న యాగశాలను అందంగా తీర్చే దిద్దే పనులు చురుగ్గా సాగుతున్నాయి. శ్రీమఠంలో క్యూలైన్లు, శ్రీమఠంలోని ప్రాంగణం, గెస్టు హౌస్‌లు, కార్యాలయాలకు రంగులు వేసి అలంకరిస్తున్నారు.

మఠానికి విరాళాలు

రాఘవేంద్రస్వామి మఠానికి మైసూరుకు చెందిన అరుణ అనే భక్తురాలు 1.1100 కేజీల వెండి, హైదరాబాదుకు చెందిన జయరాం అనే భక్తుడు రూ.లక్ష నగదు అన్నదానానికి, బెంగుళూరు సుముఖ ఎంటర్ ప్రైజెస్ ప్రొప్రైటర్ సరోజ 154 బస్తాల బియ్యం, బళ్లారి జిల్లా కడేహళ్లికి చెందిన ఎస్‌వీఎస్ సూర్యనారాయణ రాజు 20 క్వింటాళ్ల సోనమసూరు బియ్యం, కర్ణాటకలోని ఆసన్ పట్టణానికి చెందిన ఫ్రెండ్స్ గ్రూపుకు చెందిన మినీ లారీలో వివిధ రకరకాల కూరగాయలు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి తెలిపారు.

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు



నేటి నుంచి ప్రసాదం కాషాయం రంగులోకి

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో నెల రోజుల నుంచి తెలుపు రంగులో ఉన్న పరిమళ ప్రసాదం శనివారం నుంచి కాషాయ రంగులోకి మారుతుంది. ఈ రంగు పరిమళ ప్రసాదం భక్తులకు అందజేయనున్నారు.

ప్రైవేటు హాస్పిటల్స్‌లో వైద్యసేవలు బంద్

అత్యవసర సేవలకు మినహాయింపు



కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 16: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా ఒకరోజు వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కర్నూలు బ్రాంచ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ కె.రామచంద్ర నాయుడు, ఎస్వీ రామ్మోహన్ రెడ్డి, కోశాధికారి మాధవి శ్యామల శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు సాధారణ వైద్యసేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కాబట్టి 24 గంటలు ప్రజలు ఓపీ కోసం రావద్దని వారు విజ్ఞప్తి చేశారు. అత్యవసర వైద్య సేవలు కొనసాగుతాయన్నారు.

జూడాల సమ్మెతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

జూనియర్ డాక్టర్ల సమ్మె నేపథ్యంలో జిల్లాలో 14 పీహెచ్‌సీలకు చెందిన 14 మంది వైద్యులను కర్నూలు జీజీహెచ్‌కు డిప్యుటేషన్ వేస్తూ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. సమ్మె వల్ల ఇబ్బందులు పడకుండా, క్రిటికల్ కేర్, ఇతర అత్యవసర విభాగాల కోసం వైద్యులను డిప్యుటేషన్‌పై కర్నూలుకు రావాలని ఉత్తర్వులు జారీ చేశారు. నాగులాపురం, పోలకల్, సి.బెళగల్, హుశేనాపురం, కల్లూరు, గార్గేయాపురం, ఈ.తాండ్రపాడు, నన్నూరు, రామళ్లకోట, క్రిష్ణగిరి, ఉలిందకొండ, గోవర్ధనగిరి నందవరం, లద్దగిరి పీహెచ్‌సీల నుంచి వైద్యులు తక్షణమే విధుల్లో చేరాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు.

కర్నూలు జీజీహెచ్‌లో రాపిడ్ రెస్పాన్స్ టీం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్

జూనియర్ డాక్టర్ల సమ్మె వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా 15 విభాగాల వైద్యులతో రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేస్తూ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ధన్వంతరీ హాల్‌లో అన్ని డిపార్టుమెంట్ వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగాలైన ఏఎంసీ, క్యాజువాల్టీ, గైనిక్, పీడియాట్రిక్, ఎన్ఐసీయూ వార్డుల్లో యుద్ధ ప్రాతిపదికన విధులు నిర్వహించాలని సంబంధిత వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రిలో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అందరూ అందుబాటులో ఉండాలన్నారు. వైద్యులు, సిబ్బంది సెలవులన్నీ రద్దు చేయాలని హెచ్ఓడీలను ఆదేశించారు. నర్సింగ్ సిబ్బందిని కూడా అన్ని విభాగాల్లో మాన్‌పవర్‌ను పెంచాలని నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్.పి.సావిత్రిబాయిని ఆదేశించారు. ఈ సమీక్షలో వైస్ ప్రిన్సిపాల్స్ హరిచరణ్, సాయిసుధీర్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఏఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 16: బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తాలూకా పోలీసులు శుక్రవారం తెలిపారు. నంద్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు తన ఇంటి పక్కనే ఉన్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో తాలూకా అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కర్నూలు ఆగస్టు 16: నగరంలో రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆర్పీఎఫ్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా.. మృతదేహం వద్ద ఆధార్ కార్డు లభించింది. దాని ఆధారంగా మృతుని పేరు సూరిబాబుగా గుర్తించారు. ఈ విషయంపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చారు. దీనిపై టూటౌన్ పోలీసులు ఈ కేసు తమ పరిధిలో రాదంటూ రైల్వే పోలీసులే కేసు నమోదు చేయాలని తేల్చి చెప్పారు. దీంతో ఆర్పీఎఫ్ పోలీసులు అటు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కూడా ట్రాక్ మీద సంఘటన జరిగితేనే తమ పరిధిలోకి వస్తుందని, పార్కింగ్ ఏరియాలో జరిగింది కాబట్టి టూటౌన్ పోలీసులే చూసుకోవాలని తెలిపారు. దీంతో ఎట్టకేలకు టూటౌన్ పోలీసులే కేసు దర్యాప్తు ప్రారంభించారు.

బహిరంగంగా మద్యం తాగే వారిపై కేసులు

నంద్యాల క్రైం, ఆగస్టు 16 : బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులు పెట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలో నాటుసారా స్థావరాలపై విస్తృతదాడులు, ఎంవీఐ యాక్ట్ కింద 93 కేసులు నమోదు చేసి రూ.30,905 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు చేసి మూడు కేసులు నమోదు చేసి 40లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. 5డీపీఎల్ కేసులు నమోదు చేసి 18లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని, ఒక ఎన్‌డీపీఎల్ కేసు నమోదు చేసి సుమారు 14కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ మద్యంపై 6కేసులు నమోదుచేసి సుమారు 16.74లీటర్ల టెట్రా ప్యాకెట్స్, 12బీర్‌బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో బహిరంగంగా మద్యం సేవించే 23మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా దాడులు తీవ్రతరం చేశామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఒక ప్రకటనలో తెలిపారు.

హంద్రీనీవా నుంచి సాగు నీరు అందించండి



ఎస్‌ఈకి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 16: హంద్రీనీవా కాలువ నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80వేల ఎకరాలకు సాగునీరు అందించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ఎస్‌ఈ రెడ్డి శేఖర్ రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ గతంలోనే సాగునీరు విడుదలకు నిర్ణయం తీసుకున్నారని, అయితే.. 16ఏళ్లు కావస్తున్నా ఇప్పటిదాకా అందులో సగం ఎకరాల విస్తీర్ణానికైనా సాగునీరు అందించక పోవడం దారుణ మన్నారు. కనీసం కర్నూలు జిల్లాలోని 106 చెరువులకైనా సాగునీరు అందించాలని గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్ణయం తీసు కున్నా వైసీపీ ప్రభుత్వం కేవలం 77 చెరువులకు మాత్రమే తూతూ మంత్రంగా నీరు అందించిందన్నారు. ఇప్పటికైనా కర్నూలు జిల్లాలోని రైతులకు వెంటనే సాగునీరు అందించాలని ఎస్‌ఈని కోరారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 16: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఈనెల 18న గుంటూరులో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అబ్దుల్ సుభాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చాక ముస్లింలపై దాడులు కొనసాగిస్తుందన్నారు. ఇందులో భాగంగానే పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ 40 ప్రతి పాదనలు పెట్టిందని, దీనికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సదస్సుకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

తాగునీరు విడుదలపై హర్షం

కోడుమూరు(రూరల్), ఆగస్టు 16: మండలంలోని వర్కూరు సుద్ధవాగు నుంచి హంద్రీనదికి తాగునీరు విడుదల చేయించిన టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలకు వర్కూరు టీడీపీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు రాముడు, క్రిష్ణ, చెన్నరాయుడు అశోక్, మద్దూరు హనుమంతు, రామాంజనేయులు, గడ్డమయ్య, రామచంద్రుడు, నాగరాజు మాట్లాడుతూ హంద్రీలో భూగర్భ జలాలు లేక తాగునీటి పథ కాలు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. దీంతో గ్రామంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. విషయాన్ని నాయకుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి జీడీపీ కెనాల్ ద్వారా విడుదల చేయించారన్నారు.

జాబ్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

సి.బెళగల్, ఆగస్టు 16: జాబ్ కార్డులు లేనివారు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో లక్ష్మన్న తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో లక్ష్మన్న సిబ్బందితో మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో జాబు కార్డులు లేనివారు వేరేవారి పేరు మీద ఉపాధి పనులకు హాజరవుతున్నారని అన్నారు. వారు జాబుకార్డులకు ఆధార్, బియ్యం కార్డు, బ్యాంక్ ఖాతా, లేదా ఓటర్ గుర్తింపుకార్డుతో గ్రామాలలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు లేదా ఫీల్డు అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి

సి.బెళగల్, ఆగస్టు 16: పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని కోడుమూరు ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌గౌడు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, పోలకల్లు, మారం దొడ్డి గ్రామాలలో రైతులు పెంచుతున్న మామిడి, నిమ్మకాయ, జామ తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ సన్న కారు రైతులు పండ్లతోటల పెంపకంతో అధిక దిగుబడి సాధించవచ్చు అన్నారు. పండ్లతోటలు సాగు చేసుకున్న రైతులు తోటలలో అంతర్ పంటలను మూడు సంవత్సరాల వరకు సాగు చేసుకోవచ్చు అన్నారు. రైతులు తప్పనిసరి ఉద్యానవన శాఖ అధికారుల సలహాలను పాటించాలన్నారు. ఆయన వెంట ఆర్టికల్చర్ అసిస్టెంట్లు చెంచురాజు, నాయక్, నాగన్న, రైతులు ఉన్నారు.

ఒత్తిడిలో నగర పాలక అధికారులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 16: నగర పాలక సంస్థ అధికారులు ఒత్తిడిలో ఉన్నారు. నగర పాలనకు సంబంధించి పూడికతీత కార్మికుల నియామకాలు.. తొలగింపుల ప్రక్రియలో అధికారులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. శుక్రవారం కమిషనర్ బంగ్లాలో కమిషనర్ వీవీ రామలింగేశ్వర్, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు అందరూ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. మంత్రి టీజీ భరత్ చెప్పినట్లు చేయాలా.. పాత కార్మికులనే విధుల్లోకి తీసుకోవాలో అర్థం కాక మీమాంసలో పడ్డారు. ఎవ్వరికీ చెప్పలేక అధికారులంతా పారిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. గుట్టుచప్పుడు కాకుండ కమిషనర్ బంగ్లాలోకి ఫైల్స్‌ను తెప్పించుకుని సంతకాలు చేసినట్లు తెలుస్తోంది.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కోడుమూరు(రూరల్), ఆగస్టు 16: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని లద్దగిరిలో ప్రజలతో ఎస్‌ఐ సమావేశమై మాట్లాడారు. ఉన్నత పాఠశాలలో శనివారం జరుగనున్న ఎస్ఎంసీ ఎన్నికకు సంబంధించి అల్లర్లు, గొడవలకు పాల్పడ కూడదని అన్నారు.

ఓర్వకల్లు ఎస్‌ఐగా సునీల్ కుమార్



ఓర్వకల్లు, ఆగస్టు 16: ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా యా.సునీల్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వెల్దుర్తి నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పని చేశారు. బదిలీల్లో భాగంగా ఓర్వకల్లు ఎస్‌ఐగా నియమించారు. ఇక్కడ పని చేస్తున్న రాజారెడ్డి నంద్యాల జిల్లా అవుకు ఎస్‌ఐగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఓర్వకల్లు ఎస్‌ఐగా సునీల్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులు అమ్మితే శిక్షార్హులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 16: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన వక్ఫ్‌భూములు, ఆస్తులను అమ్మడం కానీ కొనడం గాని చేయరాదని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డా.సునీల్ కన్నా అన్నారు. వక్ఫ్ భూములు, ఆస్తులను 22ఏ సెక్షన్ రిజిస్ట్రేషన్ యాక్టు 19, 2007 ప్రకారం అమ్మిన వారిపై కొన్న వారిపై చట్టరీత్యా శిక్షార్హులు అని అన్నారు.

19న గెస్ట్ ఫ్యాకల్టీ కోసం ఇంటర్వ్యూ

కోడుమూరు(రూరల్), ఆగస్టు 16: కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ లెక్చరర్ కోసం అర్హత గల అభ్యర్థులు ఈ నెల 19న ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గురువారం మాట్లాడుతూ సంబంధిత అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ కనీసం 50 శాతంతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం





వాసవీనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు, వరలక్ష్మీ వ్రతం ఆచరింపజేస్తున్న వీహెచ్‌పీ మాతృశక్తి జిల్లా కోకన్వీనర్ మాళిగి భార్గవి, సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 16: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలోని మహిళలు ఆలయాల్లో, ఇండ్లలో వ్రతాలు చేశారు. కుంకుమార్చనలు, అభిషేకాలు కూడా చేశారు.

● విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో నగరంలోని హరిశ్చంద్రనగర్‌లోని సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో మాతృశక్తి జిల్లా కోకన్వీనర్ మాళిగి పావని నిర్వహణలో సామూహిక వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు.

● బళ్లారి చౌరస్తా, ఉల్చాల రోడ్డులోని వాసవీనగర్ లోగల వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వేడుకల్లో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మహాలక్ష్మీ అమ్మవారికి అష్టోత్తర శతనామ కుంకుమార్చన చేశారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, హుశేనాపురం, సోమయాజులపల్లె, శకునాల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో, ఇళ్లలో శుక్రవారం మహిళలు వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. 9 రకాల పిండి వంటలు, పుష్పాలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

గూడూరు: మండలంలోని కె.నాగులాపురం గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరీదేవి శుక్రవారం వరలక్ష్మీ అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ ఈవో, అర్చకులు ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహి ళలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.




కే నాగులాపురంలో, ఓర్వకల్లులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సంక్షేమ కేంద్రాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలి

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు వినతి



ఎంపీ నాగరాజుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 15: కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య పథక సంక్షేమ కేంద్రాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్-డీఓటీ పెన్షనర్స్ అసోసియేషన్ సర్కిల్ అధ్యక్షుడు యాకోబు కోరారు. ఈ మేరకు శుక్రవారం పంచలింగాలలో కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజును ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాకోబు మాట్లాడుతూ ఏపీకి సంబంధించి అడిషనల్ డైరెక్టర్ కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేసి సీజీహెచ్ఎస్ అధికారులను, సిబ్బందిని నియమించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డాతో చర్చించాలన్నారు. 1.1.2017 నుంచి 15 శాతం ఫిట్‌మెంట్‌తో వేజ్ రివిజన్‌తో సంబంధం లేకుండా డీలింగ్ చేసి పెన్షన్ రివిజన్ వీలైనంత త్వరగా చేయించాలన్నారు. ఎంపీని కలిసిని వారిలో జిల్లా కార్యదర్శి ఎల్. విజయభాస్కర్, సర్కిల్ సెక్రటరీ మహేశ్వరరావు, ఎస్. ఖాజామొద్దీన్, కోశాధికారి ఎస్. షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నాగరాజును కలిసిన ఎంఈఎఫ్ నాయకులు

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 16: కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును శుక్రవారం పంచలింగాలలోని ఆయన స్వగృహంలో ఎంఈఎఫ్ స్టేట్ కో కన్వీనర్ శ్రీరామ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్, ఆకెపోగు రాజారత్నం, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్న రాముడు, రాచపూడి సుందర్‌రాజులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ విషయమై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో మాదిగ, మాదిగ ఉప కులాలలకు ఉప వర్గీకరణ చేసి విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో న్యాయం చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు.

హార్టికల్చర్ ఏడీపై అధికారుల ఆగ్రహం

విధులకు రావద్దంటూ ఆదేశాలు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 16: నగర పాలక సంస్థకు సంబంధించి హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మిపై అధికారులు ఆగ్రహంగా ఉన్నారు. గురువారం పార్కులకు సంబంధించిన కార్మికుడు రాజవిహార్ కూడలిలోని డివైడర్ మధ్యలో చెట్లను నీరుపోస్తున్న సమయంలో విద్యుదాఘాతంతో మరణించాడు. దీంతో అధికారులంతా హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆగ్రహంగా ఉన్నారు. గతంలో కూడ ఆ అధికారి ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా హార్టికల్చర్ శాఖ నుంచి ఐదుగురు ఉద్యోగులను నియమించుకోవడంపై పలు విమర్శలు వచ్చాయి. మొన్నటి వరకు కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఏ. భార్గవతేజ అండతో ఈ అధికారిపై చర్యలు తీసుకోలేదు. అయితే ఇదే కార్యాలయంలో పని చేస్తున్న ఓ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కావాలనే ఆ అధికారిపై గతంలో కూడా కార్మికులను ఉసిగొల్పినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఓ కార్మికుడు విద్యుదాఘాతంతో చనిపోవడంతో ఇదే అదనుగా ఆ డీఈ ఉన్నతాధికారులకు అధికారిపై లేనిపోనివి చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఏడీని కార్యాలయాలనికి రావద్దంటూ ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఉదయం నుంచి ఆ అధికారి ఫోన్ స్విచ్‌ఆఫ్ అందుబాటులోకి రావడం లేదని కొందరు చెబుతున్నారు.

రక్త హీనతపై జాగ్రత్తలు తీసుకోవాలి

సి.బెళగల్, ఆగస్టు 16: రక్తహీనత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవా లని సి.బెళగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి మిథున్‌కుమార్‌రెడ్డి గర్భి ణులకు సూచించారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతూ గర్భిణులు వైద్యాధికారుల సలహాలు తప్ప నిసరిగా పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారం తప్పని సరి తీసుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

నేడు ఏపీయూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవం

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 16: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆవిర్భవించి శనివారం నాటికి 67 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, 67వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు తెలిపారు. ఈ వేడుకలను నగరంలోని వెంకటరమణ కాలనీ, రైతు బజార్ సమీపంలోగల కీర్తన అనాథ పిల్లల ఆశ్రమంలో శనివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటాయని తెలిపారు.

నాసిరకం రోడ్లు, డివైడర్లకు రూ.కోట్లు ఖర్చు

పట్టణ పౌర సంక్షేమం సంఘం నాయకుల ఆగ్రహం



కోడుమూరు రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న నాయకులు

కల్లూరు, ఆగస్టు 16: నాసిరకం రోడ్లు, డివైడర్ల నిర్మాణాలకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేయడాన్ని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం. నాగరాజు తప్పుబట్టారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం, శివారుకాలనీల ప్రతినిధుల బృందం వై. జంక్షన్ నుండి పెద్దపాడు వక్కెరవాగు బ్రిడ్జి వరకు శుక్రవారం పర్యటించి రహదారుల దుస్థితిని పరిశీలించారు. ఇ.పుల్లారెడ్డి మాట్లాడుతూ అడుగుకో గుంత..వాహనదారులకు చింత తప్పడం లేదని ఆర్అండ్‌బీ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. నాసిరకంగా రోడ్లు వేస్తూ అవసరానికి మించి ట్రాఫిక్ డివైడర్లను నిర్మిస్తూ ప్రజాధనాన్ని తగలబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేర్‌హౌస్ గోడౌన్ సమీపంలో ప్రధాన రహదారిపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించకుండా ఇరుకైన రోడ్లో ట్రాఫిక్ డివైడర్లను ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.సుకుమార్, సూర్యతేజ పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- కౌన్సిల్ తీర్మానం లేకుండా కొత్తవారిని ఎలా నియమిస్తారు
- మేయర్ బీవై రామయ్య

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 15: నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న పూడికతీత కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నగర మేయర్ బీవై రామయ్య, కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాలయం ఎదుట తొలగించిన కార్మికులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతోనే గత నెల జరిగిన కౌన్సిల్ సమావేశంలో అదనంగా 200 మంది కార్మికులను తీసుకోవాలని తీర్మానం చేశామన్నారు. అయితే దీనిని అదునుగా తీసుకున్న మంత్రి టీజీ భరత్ కేవలం వారికి సంబంధించిన వారికే 200 మంది కార్మికులను తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం దారుణమన్నారు. గత సంవత్సరం నుంచి రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్న 90 కార్మికులను తొలగించి నూతనంగా 200 మంది కార్మికులను తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల, ఆగస్టు 16: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టరు హనుమంతనాయక్ అన్నారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారి మాటలు నమ్మవద్దని అన్నారు. అధిక వడ్డీలకు ఆశ పడి డబ్బులను ఎవరికి పడితే వారికి ఇచ్చి ఇబ్బందులు పడకుండా ఉండాలని అన్నారు.

ఘనంగా కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతి




కోట్ల సమాధికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, కోడుమూరులో నివాళి అర్పిస్తున్న కోట్ల అభిమానులు

కల్లూరు, ఆగస్టు 16: మాజీ సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతి వేడుకలను నగరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కిసాన్ ఘాట్‌లోని కోట్ల సమాధి వద్దకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత చేరుకుని పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ మచ్చలేని నాయకుడు కోట్ల అని కొనియా డారు. కార్యక్రమంలో రామలింగేశ్వరరెడ్డి, ఆకెపోగు వేంకటస్వామి పాల్గొన్నారు.

కర్నూలు(కల్చరల్): నీతి నిజాయితీకి మారుపేరుగా దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నిలిచిపోతారని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో కోట్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా డీసీసీ కార్యాలయంలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి చిత్రపటానికి, అనంతరం కోట్ల సర్కిల్‌లోని కోట్ల కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో నడిపిన కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ప్రగతి పథంలో ఎన్నో మైలురాళ్లు సాధించి, పల్లెపల్లెకు తాగునీరు, సాగునీరు అందించారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలిం టి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పి. మురళీ కృష్ణ, పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, వివిధ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

కోడుమూరు: కోట్ల అభిమానుల ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి 104వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కోట్ల సర్కిల్లో ఆయన కాంస్య విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు సీబీ లత, సర్పంచు భాగ్యరత్న, కోట్ల కౌశిక్‌రెడ్డి, మాజీ సర్పంచు కేశరాంబాబు, గోరంట్ల తిరుమల నాయుడు, రామ్మోహన్, హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వీరేష్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు పట్టణంలో కర్నూలు పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ ఆధ్వర్యంలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజారెడ్డి, చెట్టుకింది సురేష్, సంగాల మధు, వై.నాగరాజు, చెట్టుకింది నారాయణ పాల్గొన్నారు.

జాతీయ క్రీడాదినోత్సవాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న భూపతిరావు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 16: జాతీయ క్రీడాదినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. డీఎస్ఏ స్టేడియంలోని యోగా హాలు లో క్రీడా సంఘాల ప్రతినిధులు, శిక్షకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో క్రీడా దాత న్యాయవాది శ్రీధర్ రెడ్డి, హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, స్కేటింగ్ సంఘం కార్యదర్శి సునీల్ కుమార్ హాజరయ్యారు. డీఎస్‌డీవో, కలెక్టర్ రంజిత్‌బాషా సాయంతో అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులకు జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో మెడల్స్ సాధించిన క్రీడాకారులకు ఈనెల 29న జాతీయ క్రీడాదినోత్సవం నాడు జ్ఞాపిక, ట్రాక్ షూట్‌తో సన్మానిస్తామని తెలిపారు. అలాగే జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్స్ అందజేస్తామని తెలిపారు. వివిధ క్రీడా సంఘాల కార్యదర్శులు క్రీడా శిక్షకులు, సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

'వైద్య విద్యార్థుల భద్రతకు కేంద్రం చర్యలు: బీజేపీ



మాట్లాడుతున్న నగరూరు రాఘవేంద్ర

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 16: వైద్య విద్యార్థుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇప్పటికే దేశంలోని వైద్య కళాశాలల్లో, ఆసుపత్రి ప్రాంగణాల్లో తగిన భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం నగ రంలోని 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోల్‌కతా వైద్య విద్యార్థి అత్యాచార ఘటన నేపథ్యంలో వైద్య విద్య నియంత్రణ సంస్థను జాతీయ వైద్య కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసిందని గుర్తు చేశారు.

అటవీ ఉత్పత్తులు స్వాధీనం



అటవీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్న అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), ఆగస్టు 16: అనుమతి లేకుండా తరలిస్తున్న అటవీ ఉత్పత్తులను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో సూర్యచంద్రరాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా, తడకనపల్లి వద్ద అనుమానస్పదంగా కనిపించిన బొలెరో వాహనాన్ని పరిశీలించగా, అందులో పెద్ద ఎత్తున అటవీ వస్తువులు కనిపించాయి. వీటికి అనుమతి పత్రాలు లేకపోవడంతో సరుకుతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించారు. తనిఖీల సందర్భంగా అటవీ సిబ్బందికి, సరుకు రవాణాదారులకు కొద్దిపాటి వాగ్వాదం చోటుచేసుకోగా, స్థానిక పోలీసుల రంగప్రవేశంతో సమస్య సద్దుమణిగింది. స్వాధీనం చేసుకున్న సరుకు విలువ రూ.90 వేల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు



హ్యాండ్‌బాల్ క్రీడాకారులతో అతిథులు

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 16: కదిరిలో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టు పయనమైంది. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, దాత న్యాయవాది శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ అసో సియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు హాజరై కిట్లను పంపిణీ చేశారు.

రేపటి నుంచి పర్యావరణ రక్షాబంధన్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 16: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా ఆదివారం పర్యావరణ రక్షాబంధన్ చేపడుతున్నట్లు ఆర్ఎస్ఎస్ నగర అధ్యక్షుడు డాక్టర్ చల్లా వాసురెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని బుధవార పేటలోగల కేశవ్ మెమోరియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో మాట్లాడుతూ వందేళ్ల సందర్భంగా పంచ పరివర్తన్ కార్యక్రమాలను తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 18న రక్షాబంధన్ రోజున 'పర్యావరణ రక్షాబంధన్' పేరుతో 20 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని నగరంలో చేపడుతున్నట్లు తెలిపారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ చల్లా వాసురెడ్డి తదితరులు

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

గుంతకల్-బోధన్ రైలు పునఃప్రారంభం

● ప్రయాణికుల్లో ఆనందం

మద్దికెర, ఆగస్టు 16: తెలంగాణలో రైల్వే పనుల మరమ్మతుల వల్ల సుమారు 70 రోజుల కిందట గుంతకల్ - బోధన్ ప్యాసింజర్ రైలును రద్దు చేసిన రైల్వే అధికారులు ఎట్టకేలకు పునఃప్రారంభించారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోజు గుంతకల్లు నుంచి కర్నూలు కాచిగూడ మీదుగా బోధన్ వెళ్లే రైలు నెంబరు.07671 గల రైలు శుక్రవారం ప్రారంభమైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. రోజు ఉదయం 6 గంటలకు గుంతకల్లులో బయలుదేరి మద్దికెరకు 6.11 గంటలకు చేరుకుంటుంది. తుగ్గలి, ఎద్దులదొడ్డి, పెండేకల్, లింగనాయనదొడ్డి, మల్యాల, డోన్, బోగోలు, వెల్దుర్తి, ఉలిందకొండ, దూపాడు మీదుగా కర్నూలుకు ఉదయం 8.24 గంటలకు వెళ్తుందని తెలిపారు. అలాగే బోధన్ నుంచి కాచిగూడ మీదుగా గుంతకల్లు వెళ్లే బోధన్ రైలు శనివారం పునఃప్రారంభం కాఉందని తెలిపారు. ఈ రైలు సాయంత్రం 6.54 గంటలకు మద్దికెరకు రానుంది.

'నీటి వాటాపై అధికారుల నిర్లక్ష్యం'

నందవరం, ఆగస్టు 16: ఎల్లెల్సీ కాలువకు రావాల్సిన నీటి వాటాపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మాజీ ఎల్లెల్సీ డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత పది రోజులుగా మనకు రావాల్సిన నీటివాటా 750 క్యూసెక్కులు అయితే అధికారుల నిర్లక్ష్యం మూలంగా 350 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయన్నారు. అయకట్టు రైతుల పంటలు ఎండిపోతున్నా అధికారులకు మాత్రం కన్నెత్తి చూడడం లేదన్నారు. జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు జిల్లాకు రావాల్సిన సాగునీటి వాటాను తీసుకువచ్చి ఆయకట్టు రైతులను ఆదుకోవాలన్నారు.

టీడీపీ నాయకుల ఆర్థిక సాయం


గాయపడ్డ వారికి రూ. పదివేలు నగదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆస్పరి, ఆగస్టు 16: మండలంలోని తంగరడోన గ్రామంలో గురువారం నిర్వహించిన చింతల ముని, నలారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలలో ప్రమాదవశాత్తు బాణసంచా పేలి గాయపడ్డ క్షతగాత్రులకు వైద్య, రవాణా, ఖర్చుల నిమిత్తం స్థానిక గ్రామ టీడీపీ నాయకులు రూ.10వేల ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. ప్రమాదంలో కర్ణాటకకు చెందిన నలుగురు,తెలంగాణకు చెందిన ముగ్గురుతో పాటు మరో 10 మందికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. గాయపడిన వారిని తమ గ్రామాలకు చేర్పించేలా చర్యలు తీసుకున్నట్లు ఎంపీటీసీ నరసప్ప, తెలుగు యువత నాయకుడు కృష్ణమూర్తి తమ పార్టీ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందించినట్లు వివరించారు.

ఆలయ కమిటీపై కేసు నమోదు

●దశమి ఉత్సవాలలో చోటు చేసుకున్న ప్రమాద సంఘటన నేపథ్యంలో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మస్తాన్ వల్లి తెలిపారు. ఆలయక కమిటీ నిర్లక్ష్యం వల్ల భక్తులు ప్రమాదానికి గురయారని సీఐ వివరించారు.

క్షతగాత్రులకు జనసేన పరామర్శ

ఆలూరు, ఆగస్టు 16: ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలంలోని తంగరడోణ గ్రామంలో శ్రీ చింతలముని నల్లారెడ్డి స్వామివారి ఉత్సవం సందర్భంగా బాణాసంచా పేలి గాయపడిన క్షతగాత్రులను జనసేన పార్టీ నియోజకవర్గం ఐటీ కోఆర్డినేటర్ బోయ రంజిత్ కుమార్ పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో ఆస్పరి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అరవింద్ కుమార్ ఆలూరు మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు చత్రపతి పాల్గొన్నారు.

మొక్కలు నాటండి..


మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు

మద్దికెర, ఆగస్టు 16: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి కడవల రవికుమార్, ప్రధానోపాధ్యాయులు ఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.అగ్రహారం జిల్లా పరిషత్ పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గోనెగండ్ల, ఆగస్టు 16: గోనెగండ్లలోని ఉన్నత పాఠశాలలో 2023-24 పదో తరగతి పరీక్షలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయుడు ఉస్మాన్ బాషా తన సొంత డబ్బులను విద్యార్థులకు బహుమతి గా ప్రకటించారు. శుక్రవారం రూపారాణి అనే విద్యార్థినికి రూ. 3వేలు, ఫైనాజ్ కు రూ. 2వేలు, ఐశ్వర్య అనే విద్యార్థినికి రూ. వెయ్యి పాఠశాల హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు నగదు బహుమతిని అందజేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



తాగునీటి కొళాయి వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మంత్రాలయం, ఆగస్టు 16: మండలంలోని పరమాన్ దొడ్డి తాండ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ తెలిపారు. శుక్రవారం పరమాన్‌తాండ గ్రామంలో ఉన్న కొళాయిల వద్దకు వెళ్లి వారు మహిళలను తాగునీటి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత మూడు వారాల నుంచి తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గోపాల్ నాయక్, శ్రీరామ్ నాయక్, ఓంకార్ నాయక్, గంగాబాయి, అమిలీబాయి, మహాదేవి, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు

ఆలూరు, ఆగస్టు 16: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్ హెచ్చరించారు.. శుక్రవారం ఆలూరు మండలం మొలగవల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో సోదర భావంతో మెలగాలన్నారు. ముఖ్యంగా సైబర్ వలలో పడి మోసపోవదన్నారు. కొత్త వ్యక్తులు ఫోన్‌లు చేస్తే ఆధార్, అకౌంట్ నంబర్‌లు చెప్పవదన్నారు. ఆయన వెంట ఎస్సై నరసింహులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే సహించం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 16: పట్టణంలో పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించమని మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 22వ వార్డులో పారిశుధ్య పనులను, తాగునీటి సరఫరాను పరిశీలించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. తాగునీటికిని కూడా సక్రమంగా అందించాలన్నారు.

18న అవోపా ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 16: ఈనెల 18న ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్‌లను నిర్వహిస్తున్నట్లు ఆవోపా అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, కాకుబాల్ నగేష్ తెలిపారు. శుక్రవారం ఉచిత వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 18న ఎస్‌కేడీ కాలనీలోని ఆర్యవైశ్య హాస్టల్లో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆపరేషన్లకు అవసరమైన వారికి డాక్టర్ల సలహా మేరకు నంద్యాల శాంతిరాం హాస్పిటల్‌లో ఉచితంగా చికిత్స చేయిస్తామని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఆస్పరిలో గాయత్రీ మాత ఆలయ ఆవరణలో హోమం నిర్వహిస్తున్న భక్తులు


పూజలో పాల్గొన్న మహిళలు


మద్దికెరలో...


గోనెగండ్లలో అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం



ఎమ్మిగనూరు, ఆగస్టు 16: శ్రావణమాసంలో విచ్చేసే వరలక్ష్మి వేడుకను శుక్రవార జిల్లాలోని మహిళా భక్తులు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారిని స్తుతిస్తూ విశేష పూజలను వైభవంగా నిర్వహించారు. ఎమ్మిగనూరు పట్టణంలోని లక్ష్మీపేటలో వెలసిన లక్ష్మమ్మవ్వ ఆలయంలో ఆలయ నిర్వాహకులు ఉరప్పర ఆంజనేయులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఎర్రకోట గ్రామంలో శివయ్య స్వామి ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు.

ఆస్పరి: మండల కేంద్రం ఆస్పరి సమీపంలో రామతీర్థ క్షేత్రంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. గాయత్రీ మాత ఆలయంలో 24 గంటల భజన కార్యక్రమం ముగిసిన అనంతరం వరలక్ష్మీ వ్రతం చేశారు.

గోనెగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు ఉదయం నుంచి వరలక్ష్మీ వ్రతం చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టు వస్త్రాలతో ప్రత్యేకపూల తో అందంగా అలంకరించారు.

మద్దికెర: మండలంలోని పెరవలి గ్రామంలో రంగనాథస్వామి దేవాలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు రాజ్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం రాజ్యలక్ష్మి అమ్మవారిని వరలక్ష్మి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు చేశారు.

మంత్రాలయం: మంత్రాలయంలో మంచాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు ఇచ్చారు. దూపదీప నైవేద్యాలతో అమ్మవారికి మంగళహారతులు ఇచ్చి అలంకరణ చేశారు.

తుగ్గలి: శ్రావణ మాసంలో జరుపుకునే వరలక్ష్మి వ్రత పూజలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి తదితర గ్రామాల్లో వరలక్ష్మి వ్రతం పురస్కరించుకుని వరలక్ష్మి అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పిండి వంటలు, పండ్లు నైవేద్యాలు పెట్టి, ముత్తయిదువులతో వాయినాలు సమర్పించి పూజలు చేశారు.


తుగ్గలిలో పూజలందుకుంటున్న అమ్మవారు


ఎమ్మిగనూరులో పూజలు చేస్తున్న భక్తులు


మంచాలమ్మకు హారతి ఇస్తున్న పీఠాధిపతి

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

కుడికాలువకు నీటిని విడుదల చేసిన వీరభద్రగౌడ్



దేవనకొండ, ఆగస్టు 16 : రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు సీనియర్ నాయకులు వీరభద్రగౌడ్ అన్నారు. కొత్తపల్లి వద్ద పందికోన జలాశయం కుడి కాలువకు వీరభద్రగౌడ్ నీటిని వదిలి, కాలువపై హంద్రీజలాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలువలు పూర్తి చేసి మండలంలో దాదాపు 20 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానేదనన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో హంద్రీనీవా పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఆలూరు నియోజకవర్గంలో వేదావతి, నగరడోన, హంద్రీనీవాలను పూర్తి చేస్తామన్నారు. హంద్రీనీవా నీటితో పంటలను కాపాడుకోవాలని రైతులను కోరారు. మండల టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, వెంకటస్వామిగౌడ్, రామారావునాయుడు, వీరేష్, మలకన్న, భాస్కర్, మల్లికార్జునగౌడ్, రామప్ప, రాజాసాబ్, మధుసూదన్, హెచ్ఎన్ఎస్ఎస్ ఏఈ మల్లికార్జున, జనసేన నందు, వీరేష్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తులతో కళకలలాడిన వ్యవసాయ మార్కెట్

- వేరుశనగ గరిష్ఠ ధర రూ. 7030



ఎమ్మిగనూరు, ఆగస్టు 16: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ శుక్రవారం పంట ఉత్పత్తులతో కళకలలాడింది. మార్కెట్‌కు చుట్టు ముట్టు గ్రామాలకు చెందిన రైతులు పెద్దఎత్తున్న వేరుశనగ, పొద్దుతిరుగుడు, ఆముదాలు వంటి పంట ఉత్పత్తులను విక్రయించేందుకు తీసుకురావటంతో చాలా రోజుల తరువాత మార్కెట్ రైతులతో సందడిగా కనిపించింది. 5,646 క్వింటాళ్ల వేరుశనగ, 7క్వింటాళ్ల ఆముదాలు, 2,312 క్వింటాళ్ల పూలవిత్తనాలు అమ్మకానికి వచ్చాయి. వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ. 7030లు, కనిష్ఠ ధర రూ.2400 పలికింది. అలాగే ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,460, కనిష్ఠ ధర రూ.5,330, పూలవిత్తనాలు క్వింటా గరిష్ఠ ధర రూ.3,830, కనిష్ఠ ధర రూ.3,830 పలికింది. ప్రధానంగా వేరుశనగ ధర క్వింటా రూ.7వేలకు పైగా పలకడంతో రైతులు ఆనందరం వ్యక్తం చేస్తున్నారు.

జింక పార్కు ఏర్పాటు చేయండి

ఆలూరు రూరల్, ఆగస్టు 16: దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు చేయాలని టీడీపీ రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం ముద్దనగేరి గ్రామంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జింకలు ఎక్కువ సంచరిస్తూ పంట పొలాలు నాశనం చేస్తున్నాయన్నారు. ం దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు చేయాలని, త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమవేశంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, తిరుమల రెడ్డి, కేశ రెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఆశావర్కర్లపై చర్యలు తీసుకోండి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ భీమక్క

కోసిగి, ఆగస్టు 16: ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం బాగలేదంటూ ప్రైవేటు ఆసుపత్రులకు గర్భిణులను, బాలింతలను తీసుకెళ్తున్న ఆశా వర్కర్లపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ, కోసిగి ఎంపీటీసీ నాడిగేని భీమక్క డిమాండ్ చేశారు. శుక్రవారం కోసిగిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు సమయ పాలన పాటించడం లేదన్నారు. అలాగే గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత స్కానింగ్ పరీక్షలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ కోతలు అధికంగా ఉన్నాయని, కోతలు లేకుండా విద్యుత్ అందించాలన్నారు. గ్రామాల్లో దోమలబెడద తీవ్రంగా ఉందని, ఫాగింగ్ చేయాలని సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ హరూణ్ రషీద్, ఆర్ఐ శ్రీరాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున, డా.మనోజ్‌కుమార్, ఎల్లెల్సీ ఏఈ రాజేష్, ఏవో రాజు, కోఆప్షన్ మెంబర్ షౌకత్ ఆలీ, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తను పరామర్శించిన తిక్కారెడ్డి


రంగన్నను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న తిక్కారెడ్డి

కోసిగి, ఆగస్టు 16: కర్నూలులో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోసిగి చెందిన టీడీపీ నాయకులు నాడిగేని రంగన్నను టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి శుక్రవారం పరామర్శించారు. రంగన్న ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. రంగన్న భార్య, కుమారుడు మాదేవను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈయన వెంట జిల్లా వాణిజ్య విభాగం నాయకులు పెండ్యాల భరద్వాజశెట్టి ఉన్నారు.

వెల్దుర్తి ఎస్ఐగా అశోక్

వెల్దుర్తి, ఆగష్టు, 16: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ జి అశోక్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం నుంచి కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలానికి బదిలీపై వచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడతానిని తెలిపారు.

అన్న క్యాంటీన్లతో పేదవారి ఆకలి తీరుతుంది

తుగ్గలి, ఆగస్టు 16: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాట్లు చేస్తున్న అన్న క్యాంటీన్లతో ప్రతి పేదవాని ఆకలి తీరుతుందని టీడీపీ నాయకులు రామచంద్ర, సర్పంచ్ సుజాతమ్మ అన్నారు. శుక్రవారం ముక్కెళ్లలో వారు మాట్లాడుతూ పేదవాని ఆకలి తీర్చేందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్లలో రూ.5లకే భోజనం, టిఫిన్‌లు అందిస్తున్నారని, గతంలో కూడా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదవారి ఆకలి తీర్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

సంత మార్కెట్ దుకాణాలను ప్రారంభించాలి



సంత మార్కెట్‌లో దుకాణాల ముందు నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆలూరు రూరల్, ఆగస్టు 16: ఆలూరు సంత మార్కెట్‌లో నిర్మించిన 16 దుకాణాలను ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి షాకీర్, సీనియర్ నాయకులు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో దుకాణాల ముందు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ దుకాణాల నిర్మాణం పూర్తి చేసి నాలుగేళ్లయిన ప్రారంభానికి నోచుకోవడం లేదన్నారు. గ్రామ పంచాయతీకి లక్షల రూపాయలు గండి కొట్టడమే కాకుండా నిరుద్యోగులు నాలుగేళ్లగా ఉపాధి కోల్పోయరన్నారు. గ్రామ సర్పంచ్, అధికారులు నిర్ణయం తీసుకొని తక్షణమే సంత మర్కెట్ వ్యాపార సముదాయన్ని ప్రారంభించి బహిరంగ వేలం వేయాలని, షాప్‌ల తాళాలు పగలగొట్టి నిరుద్యోగులకు అందజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈరన్న, క్రిష్ణ, విఠల్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేడు వైద్య సేవల నలిపివేత

● ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ కుమార్

ఆదోని (అగ్రికల్చర్, ఆగస్టు 16: కోలకత్తాలో వైద్యురాలిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షంచాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మధుసూదన్, కోశాధికారి డాక్టర్ ఆదిత్య, డా.సందీప్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈనెల 9న రాత్రి డ్యుటీలో ఉన్న మహిళ వైద్యురాలపై అమానుషంగా సామూహిక అత్యాచారం చేయడం దుర్మార్గమన్నారు. దానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఆర్‌జీకర్ వైద్య కళాశాల ఆసుపత్రి మెడికోలు, వైద్యులపై రౌడీ మూకలు దాడి చేయడం నిరసిస్తూ ఐఎంఏ 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేయాలని పిలుపునిచ్చిందన్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రిలో అత్యవసర సేవలు మినహాయించి, ఓపీడీ సేవలు, శస్త్ర చికిత్సలు పూర్తిస్థాయిలో నిలిపి వేస్తున్నామని తెలిపారు. ప్రజలు వైద్య సేవల నిలిపివేతకు సహకరించాలని కోరారు.

పంట నమోదు తప్పనిసరి


పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వెల్దుర్తి, ఆగస్టు 16: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులు తమ దగ్గర్లో ఉన్న రైతు సేవా కేంద్రంలో తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అక్బర్‌బాషా తెలిపారు. శుక్రవారం చెరుకులపాడు గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అదేవిధంగా వెల్దుర్తి పట్టణంలో ఉన్న ఆశ్రీత క్రాప్ కేర్ సెంటర్, వెంకటరమణ ట్రేడర్స్ పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. లైసెన్సులను, రికార్డులను, స్టాక్ బోర్డులను, గోడౌన్‌లలో ఉన్న నిల్వలను తనిఖీ చేశారు. నాణ్యత ప్రమాణల నిమిత్తం నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో ఏడీఏ మోహన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 16: విశాఖపట్నంలో సెప్టెంబర్ 1,2,3వ తేదీల్లో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని వీరేష్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం మునెప్ప మాట్లాడుతూఏఐటీయూసీ సంఘం కార్మికులకు, కర్షకులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. జాతీయ సమ్మేళనానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం జాతీయ సమ్మేళన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు, విద్యుత్ మీటర్ రీడర్స్ నరసింహులు, వీరాంజిగౌడు, దాదావలి, వీరేష్, నాయుడు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 16: కోల్‌కత్తాలో ఆర్‌జీకార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాశింవలి, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని గాంధీ విగ్రహం ముందు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అత్యాచారానికి పాల్పడిన నింధితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో దాదా, కలాందర్, అనంత్‌కుమార్, విష్ణు, రాజు, విజయ్, హర్ష, వినోద్, హరి, ధరణిలు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరిపించాలి


డీఎస్పీ సోమన్నకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 16: మండలంలోని రచుమర్రి గ్రామంలోని మోడల్ స్కూల్ విద్యార్థిని పార్వతి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరు ఇన్‌చార్జి డీఎస్పీ సోమన్నని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ గత పది రోజుల క్రితం విద్యార్థిని పార్వతి ఉరేసుకొని మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు సూరి కార్యదర్శి గౌస్ యశ్వంత్ రాజు పాల్గొన్నారు.

ముగిసిన దశమి ఉత్సవాలు

ఆస్పరి, ఆగస్టు 16: మండలంలోని తంగారడోనలో చింతల ముని నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు గ్రామంలో నిర్వహించిన ఉత్సవాల అనంతరం నల్లారెడ్డి స్వామి ఆలయ ప్రాంగణంలో రాక్షసి బలి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పార్వతి, గ్రామ సర్పంచ్ శంకరమ్మ, ఎంపీటీసీ నరసప్ప, వెంకన్న బాబు పాల్గొన్నారు.

నలకదొడ్డి మాజీ సర్పంచ్ గోవిందమ్మ మృతి



పత్తికొండ, ఆగస్టు 16: మండలంలోని నలకదొడ్డి పంచాయితీ మాజీసర్పంచ్ గోవిందమ్మ(80) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. 1995 - 2000 వరకు ఆమె గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఆమె మనవడు బత్తిని లోక్‌నాథ్ ప్రస్తుతం తెలుగుయువత రాష్ట్ర నాయకుడిగా ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ బీఎస్ఎస్ అధ్యక్షుడిగా రామతీర్థం అమరేష్

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 16 : బీఎస్ఎస్ కమిటీ అధ్యక్షుడిగా రామతీర్థం అమరేష్‌ను ఎన్నికయ్యారు. జాతీయ పారిశ్రామిక విభాగ కన్వీనరుగా అడ్వకేట్ సునీల్,విద్యా పాలసీ అడ్వైజర్ కృష్ణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హనీఫ్,హకీమ్,ఇస్మాయిల్,లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గుంతలు పూడ్చాలి



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 16: పట్టణంలోని మేధారగేరి వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి రోడ్డుపై గుంతలను, తేలిన ఇనుప కడ్డీలను పూడ్చాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఫ్లై ఓవర్‌పై గుంతల వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి సిరిగింప క్రాస్ రోడ్డు వరకు ప్రధాన రహదారులన్నీ అడుగులోతు గుంతలు పడ్డాయని అన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వల్ల ప్రతిరోజు గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, బీమేష్, కల్లుబావి రాజు, షేక్షావలి హుస్సేని, గోవిందు, ప్రకాష్, తాయన్న పాల్గొన్నారు.